నమస్తే తెలంగాణ
హనుమకొండ
3 | వరంగల్, శనివారం 21 సెప్టెంబర్ 2024 | HANUMAKONDA



బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో దాస్యం వినయ్ భాస్కర్, సుందర్‌రాజ్ యాదవ్

త్వరలో వరంగల్‌లో పర్యటిస్తా..

- కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుదాం
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు కోసం పోరాడుదాం..
- బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

హనుమకొండ, సెప్టెంబర్ 20: అతి త్వరలో వరంగల్‌లో పర్యటిస్తానని, పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేస్తానని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నందినగర్‌లోని కేటీఆర్ ఇంట్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్ బోయినపల్లి రంజిత్‌రావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగడుదామన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు కోసం పోరాడుదామన్నారు. రైతు రుణ మాఫీ, రైతు బంధు పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు కలిసి కట్టుగా రైతుల పక్షాన నిలవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసే వరకు కొట్లాడుదామన్నారు.

చౌడారంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మహిళలు

నీళ్ల చారు.. గుడ్డు లేదు

- చౌడారం మోడల్ స్కూల్‌లో భోజనం తినలేక విద్యార్థుల అవస్థలు
- ఇంటి నుంచి తెచ్చుకుంటున్న వైనం
- సక్రమంగా అమలుకాని మెనూ

ఇంటి నుంచి తెచ్చుకుని భోజనం చేస్తున్న విద్యార్థులు, (ఇన్‌సెట్) విద్యార్థులకు వడ్డిస్తున్న నీళ్లచారు భోజనం



జనగామ రూరల్, సెప్టెంబర్ 20: మండలంలోని చౌడారం మోడల్ స్కూల్‌లో మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. గుడ్డు లేకుండా నీళ్ల చారు వడ్డిస్తున్నారు. దీంతో విద్యార్థులు తినలేక అవస్థలు పడుతున్నారు. భోజనం నచ్చక కొందరు తమ ఇంటి నుంచే తెచ్చుకొని తింటున్నారు. రోజు తప్పించి రోజు గుడ్డు పెట్టడం లేదని, వారు పెట్టిందే తినాలని, లేకుంటే కడుపు మాడ్చుకోవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా నాణ్యమైన భోజనం అందించాలని కోరుతున్నారు. ఈ విషయపై పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దీపారాణిని వివరణ కోరగా తాను ఇక్కడ చార్జ్ తీసుకుని రెండు రోజులవుతున్నదని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, గుడ్డు తప్పకుండా పెట్టాలని తెలిపామన్నారు. ఈ రోజు గుడ్లు వేసేవారు రాకపోవడంతో కొందరు విద్యార్థులకు అందలేదని, రేపటి నుంచి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేలా చూస్తానని తెలిపారు.

రుణమాఫీ చేయాల్సిందే..

పీఏసీఎస్ ఎదుట రైతుల ధర్నా

నిడిగొండ పీఏసీఎస్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

రఘునాథపల్లి, సెప్టెంబర్ 20: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 2లక్షల రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని నిడిగొండ పీఏసీఎస్ ఎదుట ఆయా గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ అర్హులకు అందలేదన్నారు. అధికారులు స్పందించి రుణమాఫీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ రిజ్వాన్‌బాషాకు అందించారు. కార్యక్రమంలో ఎలపాటి రాంరెడ్డి, ఎలపాటి కరుణాకర్‌రెడ్డి, మైలారం ఆంజనేయులు, మాసపల్లి శాంతాజీ, తిప్పారపు రవీందర్, పెద్దగోని శ్రీనివాస్, కే నర్సింగరావు, టీ శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ కమిషన్‌కు ఏకరువు

రాష్ట్ర కమిటీతో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆగస్టు 27వ తేదీన సివిల్ సప్లయ్ కమిషనర్‌కు ఏకరువు పెట్టామని, నెల రోజులు కావస్తున్నా ఏ విధమైన నిర్ణయం తీసుకోలేదని మిల్లర్లు చెబుతున్నారు. పదేళ్లలో కరెంట్, హమాలీ చార్జీలు, వర్కర్ల వేతనాలు, మిల్లు స్పేర్‌పార్టుల ధరలు మూడింతలు పెరిగాయని, తమకు బిల్లింగ్ చార్జీలు పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఒక క్వింటా ధాన్యాన్ని మిల్లింగ్ చేసి సీఎంఆర్ కింద ఎఫ్‌సీఐ గోదాంలకు పంపించాలంటే వచ్చే ఖర్చు ధాన్యం తేమ తరుగుతో కలుపుకొని రూ. 547 అవుతుందని, అదే పద్ధతిన ఉప ఉత్పత్తులను మార్కెట్ ధర ప్రకారం అమ్మితే వచ్చే మొత్తం రూ.447 వస్తుందన్నారు. ఈ లెక్కన క్వింటా ధాన్యానికి రూ.100 వరకు నష్టం వస్తుందని, ఈ కారణంగానే రైస్ మిల్లర్లు అంతా డిఫాల్టర్లుగా మారి సీఎంఆర్‌ను సకాలంలో అందించ లేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ కారణాలతో వానకాలంలో ధాన్యం కొనుగోళ్లలో భాగస్వామ్యం అయ్యేందుకు సుముఖంగా లేమని తెలియజేశారు. క్వింటా సన్న వడ్ల మిల్లింగ్‌కు రూ.150, దొడ్డు వడ్లకు రూ.100 చొప్పున చెల్లిస్తూ 14తేమ శాతంతో వడ్లు ఇచ్చిన మొదటి రోజు నుంచి మిల్లింగ్ ప్రారంభించి పాత గన్నీ సరైన రేటును నిర్ణయించి రావాల్సిన బకాయిలన్నింటిని చెల్లించినట్లయితే వానకాలం ధాన్యం కొనుగోళ్లలో పాల్గొంటామని తేల్చిచెబుతున్నారు

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం వెల్తుర్లపల్లిలో రైస్ మిల్లు వద్ద ధాన్యాన్ని లారీలోకి ఎక్కిస్తున్న సిబ్బంది

- రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సివిల్ సప్లయ్ కమిషనర్‌కు ఏకరువు
- వానకాలంలో వడ్లు తీసుకునేందుకు సుముఖంగా లేని వైనం

ధాన్యం సేకరణకు వెనకడుగు

67 శాతం బియ్యం ఇవ్వలేమంటున్న రైస్‌మిల్లర్లు

ములుగు, సెప్టెంబర్20(నమస్తేతెలంగాణ): ములుగు జిల్లాలో వానకాలం ధాన్యం సేకరణకు రైస్‌మిల్లర్లు వెనకడుగు వేస్తున్నారు. ఈ మేరకు తమను భాగస్వామ్యం చేయవద్దని గురువారం రైస్ మిల్లర్లు కలెక్టర్ టీఎస్ దివాకరను కలిసి మెమోరాండం సమర్పించారు. 2025 జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం రాష్ట్ర రైస్ మిల్లు నాయకులను సంప్రదించకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకుందని, సన్నవడ్ల నుంచి 67 శాతం బియ్యాన్ని ఇవ్వలేమని స్పష్టం చేస్తున్నారు. సగటున క్వింటా సన్నవడ్లకు 59 కిలోలకు మించి బియ్యం రావని, తరుగు ఉత్పత్తులు అమ్మగా వచ్చే పైసలు తరుగు ధాన్యం క్వింటా రూ. 2800 చొప్పున కొనుగోలు చేసేందుకు కూడా సరిపోక మిల్లర్లు భారీ స్థాయిలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌కు బాకీ పడే అవకాశాలున్నాయన్నారు. సన్నవడ్లు 17శాతం తేమతో 45 రోజుల వరకు మాత్రమే రంగు మారకుండా ఉంటాయని, ఐదో నెలలో

ములుగు కలెక్టర్‌కు మెమోరాండం ఇస్తున్న రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు

సీఎంఆర్‌కు పనికి రాకుండా పోతాయన్నారు. మిల్లింగ్, ట్రాన్స్‌పోర్టు, డ్రైయేజి, కస్టోడియన్ చార్జీలు ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రాలేదని, అవి ప్రభుత్వం ఇస్తే తాము సీఎంఆర్ బకాయిని పూర్తిగా చెల్లిస్తామంటున్నారు.

రైసుమిల్లుల్లో బియ్యం మాయం

- పెద్ద ఎత్తున సీఎంఆర్‌కు గండి
- ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు చేసి ఇండస్ట్రీస్‌పై క్రిమినల్ కేసులకు సిఫారసులు

ఎల్కతుర్తి/ఐనవోలు/ మరిపెడ, సెప్టెంబర్ 20: ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్‌లో రైస్‌మిల్లుల యజమానులు భారీగా అవినీతికి పాల్పడ్డారు. కోట్లాది రూపాయల విలువ చేసే ధాన్యాన్ని మాయం చేశారు. ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేటలోని శ్రీబాలాజీ, ఐనవోలు మండలంలోని పున్నేల్ గ్రామంలోని నారాయణ ఆగ్రో ఇండస్ట్రీ, మరిపెడ మండలం యల్లంపేట వద్ద గల లక్ష్మీ పారా బాయిల్డ్ మిల్లుల్లో శుక్రవారం సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. మిల్లులో నిల్వ ఉన్న సీఎంఆర్ ధాన్యాన్ని లెక్కించగా భారీ ఎత్తున బస్తాలు మాయమైనట్లు తేలింది. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేకాధికారి ఎల్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బాలాజీ మిల్లు ప్రభుత్వానికి సీఎంఆర్ కింద 3521 టన్నులు ఇవ్వాల్సి ఉండగా, కేవలం 205 టన్నులు, నారాయణ ఆగ్రో ఇండస్ట్రీ 58 వేల బస్తాలు ఇవ్వాల్సి ఉండగా, 7641 బస్తాలు మాత్రమే నిల్వ ఉన్నాయన్నారు. అయితే ప్రభుత్వం సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యం మిల్లులకు ఒక అవకాశం ఇచ్చిందని, ధాన్యం లేనియెడల డబ్బులైనా ప్రభుత్వానికి చెల్లించాలని చెప్పి గడువు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ మిల్లుల యజమానులు స్పందించకపోవడంతో ఈ దాడులు చేస్తున్నట్లు వివరించారు. మిల్లు యజమానులపై క్రిమినల్ కేసులకు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీటీసీఎస్ నాగేంద్రప్రసాద్, ఎఫ్ఐ మోటం సదానందం, టీవీ కనకాచారి ఉన్నారు.

ఐనవోలు మండలం పున్నేల్‌లో నారాయణ ఆగ్రో ఇండస్ట్రీలో తనిఖీలు చేస్తున్న లక్ష్మారెడ్డి, సివిల్ సప్లయ్ అధికారులు

పిడుగు పాటుకు యువకుడి మృతి

అల్లం ప్రవీణ్ (ఫైల్)

గార్ల/మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్20 : గార్ల మండల పరిధిలోని పాత పోచారంలో పిడుగుపడి యువకుడు మృతి చెందగా, తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన అల్లం వెంటేశ్వర్లు-కోటేశ్వరికి ఇద్దరు కుమారులు. శుక్రవారం తల్లి కోటేశ్వరితో కలిసి చిన్నకుమారుడు ప్రవీణ్ (23) మిర్చి తోటలో పనికి వెళ్లాడు. ఉరుములు, మెరుపుల వర్షంతో భారీ శబ్దంతో పిడుగుపడి ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి కోటేశ్వరి స్పృహ కోల్పోయి కింద పడి తీవ్రంగా గాయపడింది. చుట్టుపక్కల రైతులు ఇద్దరిని సమీపంలోని దవాఖానకు తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి ప్రవీణ్ మృతి చెందినట్లు తెలిపారు. అదేవిధంగా మహబూబాబాద్ మండలంలోని శనిగపురం గ్రామ శివారు బగ్గతండాకు చెందిన రాములు అస్వస్థతకు గురికాగా, అతని రెండు గొర్రెలు మృతి చెందాయి. రాములును చికిత్స కోసం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

- రూ. 10 వేల జరిమానా
- తీర్పునిచ్చిన భూపాలపల్లి జిల్లా కోర్టు జడ్జి

గణపురం, సెప్టెంబర్ 20: బాలికపై లైంగిక దాడి ఘటనలో నిందితుడికి 20 ఏళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ భూపాలపల్లి జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నారాయణబాబు తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. రేగొండ మండలం పొనగండ్లకు చెందిన ఎలబద్రి సురేశ్ 2020లో గణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగికదాడి పాల్పడ్డాడు. విషయం కుటుంబసభ్యులకు తెలపడంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రాజన్‌బాబు కేసు నమోదు చేశారు. ఈ మేరకు పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించారు. డీఎ స్పీ సంపత్‌రావు, చిట్యాల సీఐ మల్లేశ్ దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. స్టేషన్ పీపీ కేసును కోర్టులో వాదించగా గణపురం ఎస్సై అశోక్, కోర్టు ఆఫీసర్ శ్వేత సాక్షులను ప్రవేశపెట్టారు. పూర్తిస్థాయి విచారణ, సాక్షాల ను పరిశీలించిన న్యాయమూర్తి శుక్రవారం తీర్పు వెల్లడించారు. పోక్సో చట్టం కింద నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించారు. సాక్షులను ప్రవేశ పెట్టడంలో ప్రత్యేక శ్రద్ధ వహించిన భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, సీఐ మల్లేశ్, గణపురం ఎస్సై అశోక్‌ను కోర్టు అభినందించింది.

వరద సాయం కోసం రీ సర్వే

- 'నమస్తే' కథనంతో రావిరాలలో గ్రామసభ
- బాధితుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

రావిరాలలో నిర్వహించిన గ్రామసభలో దరఖాస్తులు ఇవ్వడానికి పోటీ పడుతున్న బాధిత ప్రజలు

నెల్లికుదురు, సెప్టెంబర్ 20 : ఇటీవల వరదలకు నెల్లికుదురు మండలం రావిరాల జలదిగ్బంధమై భారీ నష్టం వాటిల్లగా నష్టపోయిన వారిలో కొందరికే సాయం అందింది. అధికారులు సర్వే చేసి 143 మందిని మాత్రమే బాధితులుగా గుర్తించి, అర్హులను పట్టించుకోకపోవడంపై ఈ నెల 19 నమస్తే తెలంగాణలో ప్రచురితమైన 'కొండంత నష్టం.. గోరంత సాయం' కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు శుక్రవారం రావిరాలలో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ రాజు, ఎంపీడీవో బాలరాజు గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. నష్టం జరిగినా సాయం అందని వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి రీ సర్వే చేసి అర్హులైతే సాయం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తహసీల్దార్ తెలిపారు. రెండు రోజుల్లో మరికొన్ని స్వచ్ఛంద సంస్థల ద్వారా గ్రామంలోని 430 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకులు మేల్కోవాలి

- ఇన్ని రోజులు ఆగినం.. ఇక ఊరుకునే ప్రసక్తే లేదు
- కష్ట కాలంలో ఉన్నోడే మనోడు
- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా
- మాజీ మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి, సెప్టెంబర్ 20: 'ఇన్ని రోజులు నిశ్శబ్దంగా ఉన్నాం.. ఇక ఊరుకునే ప్రసక్తే లేదు.. కార్యకర్తల జోలికొస్తే వదిలిపెట్టం.. ఎంతవరకైనా సిద్ధం' అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సృష్టం చేశారు. శుక్రవారం పాలకుర్తి మండల కేంద్రంలో సోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఊపిరి ఉన్నంత వరకు ప్రజా సేవకే పాటుపడుతాన్నారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం తాను నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఏ చిన్న కష్టం వచ్చినా వెంటనే తాను ప్రత్యక్ష మవుతానన్నారు. ఇకనైనా నిద్ర నుంచి కాంగ్రెస్ నాయకులు మేలుకోవాలన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. కష్టకాలంలో ఉన్నోడే మనోడు అని ఎర్రబెల్లి కార్యకర్తలకు మనోధైర్యం కల్పించారు. యువతకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, రైతు రుణమాఫీ ఇప్పటికీ కొంతమందికి కాలేదని, రైతు భరోసా ఊసే లేదన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేని ఒక ఫెయిల్యూర్ ప్రభుత్వంగా మిగిలిపోతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పస్నూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, సొసైటీ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కర్ణాకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, మండల ఉపాధ్యక్షుడు పాము శ్రీనివాస్, సోమేశ్వర్‌రావు, చిలుకమారి నాగేశ్వర్, అబ్బాస్ అలీ, జోగు గోపి పాల్గొన్నారు. మండలంలో మల్లంపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన జర్నలిస్ట్ జిలకర శ్రీనివాస్ కుటుంబాన్ని, మండల కేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎండీ నసీమా కుటుంబాన్ని దయాకర్‌రావు పరామర్శించారు.

చెరువు శిఖం స్వాహా!

- రూ. 6 కోట్ల విలువైన 3.32 ఎకరాలు కబ్జా
- హద్దురాళ్లు తొలగింపు, యథేచ్ఛగా వెంచర్ ఏర్పాటు
- పక్కనే మరో 2 ఎకరాలకు రెక్కలు
- చక్రం తిప్పిన ఓ రెవెన్యూ అధికారి

శిఖం భూమిలో నీటి పారుదల శాఖ అధికారులు వేసిన హద్దురాళ్లు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం భూపాలపల్లి మండలం కొంపెల్లి శివారు 209 సర్వే నంబర్‌లోని గోరంట్లకుంట చెరువు శిఖానికి రెవెన్యూ అధికారులు నాలా అనుమతి ఇచ్చినట్లు సమాచారం. చెరువు శిఖం మొత్తం 22.32 ఎకరాలు ఉండగా, ఇందులో నాలుగు ఎకరాలు కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించారు. ఇదే సర్వే నంబర్‌లో వేంకటేశ్వర దేవాలయం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఆర్ అండ్ బీ అతిథి గృహాన్ని సుమారు 5 ఎకరాల్లో నిర్మించారు. మరో 3.32 ఎకరాల శిఖం భూమి ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లింది. 209 సర్వే నంబర్‌లో చెరువు శిఖం భూమి ఉండగా పక్కనే 213, 208 సర్వే నంబర్లలో పట్టా భూములు ఉన్నాయి. ఇది అక్రమార్కులకు కలిసొచ్చింది. 208, 213 సర్వే నంబర్ల పేరుతో చెరువు శిఖం భూమికి రెవెన్యూ అధికారుల నుంచి నాలా అనుమతి పొంది, ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించారు. కొన్నేళ్లుగా ఈ తతంగం జరుగుతున్నా, ఇటీవల కాలంలోనే రియల్ వ్యాపారులు ఒక రెవెన్యూ అధికారి కనుసన్నల్లో నాలా అనుమతి పొంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిసింది.

శిఖంలో రియల్ దందా

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారికి సమీపంలో ఉన్న 209 సర్వే నంబర్‌లోని గోరంట్లకుంట చెరువు శిఖం భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు బిజినెస్ ప్రారంభించారు. చెరువు శిఖంలో అక్రమార్కులు 1.32 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్, 1.25 ఎకరాల్లో వ్యవసాయం, 15 గుంటల్లో ప్లాట్లు ఏర్పాటు చేసుకున్నారు. 213, 208 సర్వే నంబర్లలోని పట్టా భూముల నంబర్లను వేసి శిఖం భూమికి నాలా అనుమతి పొంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఓ రెవెన్యూ అధికారి నాలా అనుమతి ఇవ్వడంలో ప్రధాన భూమిక పోషించినట్లు తెలుస్తున్నది. ఇందులో 1.25 ఎకరాల్లో ఒకరు వ్యవసాయం చేసుకుంటుండగా , 15 గుంటల భూమిని కొందరు ప్లాట్లు చేసుకున్నారు. మరో 1.32 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు చేసి విక్రయించారు. కాగా, కొనుగోలు చేసిన వారు విషయం తెలుసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇదిలా ఉండగా ఓ రెవెన్యూ అధికారి శిఖం హద్దులు కావాలనే తప్పుగా ఏర్పాటు చేయడంతో సుమారు 2 ఎకరాల భూమిని కొందరికి లబ్ధి చేకూర్చాడనే ప్రచారం జరుగుతున్నది. కాగా, శిఖం భూమి చుట్టూ అక్రమిత ప్రాంతంలో సైతం నీటిపారుదల అధికారులు హద్దురాళ్లు ఏర్పాటు చేయగా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తొలగించారు. గోరంట్లకుంట చెరువు శిఖంలో పూర్తిస్థాయిలో సర్వే చేసి మళ్లీ హద్దులు వేస్తే పెద్దఎత్తున అవినీతి బట్టబయలు అవుతుందని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు.

చెరువు శిఖం భూమిలో ఏర్పాటు చేసిన వెంచర్, (ఇన్‌సెట్) స్థలంలో అధికారులు కూల్చివేసిన గోడ

కేసు ఫైల్ చేశాం : బసవ ప్రసాద్, ఐబీ డీఈ

భూపాలపల్లిలోని 209 సర్వేనంబర్‌లో గోరంట్లకుంటలో 22.32 ఎకరాల చెరువు శిఖం ఉండగా ఇందులో సుమారు 5 ఎకరాల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఆర్ అండ్‌బీ అతిథి గృహం, వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణం జరిగింది. 1.25 ఎకరాల భూమిని ఒకరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని వ్యవసాయం చేస్తున్నాడు. అలాగే 15 గుంటల భూమిని కొందరు ప్లాట్లుగా మార్చారు. 1.32 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేశారు. అధికారుల సహకారంతో నాలా అనుమతి పొంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. విచారణ జరిపి కేసు ఫైల్ చేశాం. నివేదిక కలెక్టర్‌కు సమర్పించాం. కలెక్టర్ స్టడీ చేస్తున్నారు. త్వరలోనే చర్యలు ఉంటాయి.

కొందరు అక్రమార్కులు ఏకంగా చెరువు శిఖాన్నే స్వాహా చేశారు. పక్కనే ఉన్న సర్వే నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించి, పట్టా భూమిగా మార్చి, ప్లాట్లు చేసి ఎంచక్కా అమ్మకానికి పెట్టారు. గుంట కాదు.. రెండు గుంటలు కాదు.. సుమారు రూ.6 కోట్ల విలువైన 3.32 ఎకరాల చెరువు శిఖాన్ని అప్పనంగా కాజేసి, రెండింతల ఆదాయం పొందారు. ఈ తతంగంలో ఓ రెవెన్యూ అధికారి కీలక పాత్ర పోషించగా, అతడిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి.

- జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్20 (నమస్తే తెలంగాణ)

సినీ ఫక్కీలో గంజాయి స్మగ్లింగ్

ట్రాక్టర్ ట్రాలీ కింద పేర్చిన గంజాయి ప్యాకెట్లు

- అనుమానం రాకుండా ట్రాక్టర్ ట్రాలీ కింద పేర్చి రవాణా
- 338 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

సుబేదారి, సెప్టెంబర్20: అనుమానం రాకుండా సినీ ఫక్కీలో ట్రాక్టర్ ట్రాలీ కింద గంజాయి ప్యాకెట్లు పెట్టి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని హసన్‌పర్తి, యాంటీ డ్రగ్స్ విభాగం పోలీసులు పట్టుకున్నారు. రూ. 85లక్షల విలువైన 338 కిలోల గంజాయి ప్యాకెట్లు, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిశోర్ ఝా నిందితుడి అరెస్ట్‌ను చూపించి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా పాతకోటకు చెందిన కిలో లక్ష్మీనారాయణ ఒడిశాకు చెందిన మరో నిందితుడితో కలిసి 338 కిలోల గంజాయి ప్యాకెట్లను ట్రాక్టర్ ట్రాలీ కింద రహస్యంగా డబ్బాలో అమర్చాడు. అనంతరం ధారకొండ మీదుగా కామారెడ్డి నుంచి సిద్దిపేటకు వెళ్తుండగా పక్కా సమాచారంతో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంతసాగర్ క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు లక్ష్మీనారాయణను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. ఈ కేసులో ప్రతిభ చాటిన యాంటీ డ్రగ్స్ ఏసీపీ సైదులు, కాజీపేట ఏసీపీ తిరుమల్, హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ చేరాలు, యాంటీ డ్రగ్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ సురేశ్, ఎస్సైలు దేవేందర్‌రెడ్డి, రవిని సీపీ అభినందించారు.

పాకాలలో మొసళ్లకు జియోట్యాగింగ్

- వాటి సంఖ్యపై స్పష్టత వచ్చే అవకాశం
- కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో డిసెంబర్, జనవరి నెలల్లో సర్వే

ఖానాపురం, సెప్టెంబర్ 20: కాకతీయులు నిర్మించిన ప్రసిద్ధ పాకాల సరస్సులో మొసళ్లకు జియోట్యాగింగ్ చేయనున్నారు. సరస్సులో మొసళ్ల సంఖ్యను గుర్తించేందుకు కేంద్రప్రభుత్వం జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టం 3.23 టీఎంసీలు కాగా, ఇది మొసళ్లకు నిలయంగా మారింది. పంటకాలువలతో పాటు సమీప ప్రదేశాల్లో ఎక్కడ మొసళ్లు కనిపించినా తీసుకొచ్చి ఈ సరస్సులో వదిలేస్తుంటారు. ఇక్కడ ఎక్కువగా మొసళ్లు ఉండడంతో అటవీ శాఖాధికారులు హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఈతలు కొట్టడం, చేపలు పట్టడాన్ని నిషేధించారు. తాజాగా డిసెంబర్, జనవరి నెలల్లో దానికి సంబంధించిన అధికారులు పాకాలకు వచ్చి మొసళ్లను బయటికి తీసి వాటికి జియోట్యాగింగ్ చేసి మళ్లీ సరస్సులో వదిలివేయనున్నారు. దీంతో మొసళ్ల సంఖ్యపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

మానుకోట ఎస్సైపై దాడి

- పోలీస్‌స్టేషన్‌లోనే ఘటన, కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 20: ఓ కేసు విషయంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన యువకుడు ఎస్సైపైనే దాడి చేశాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మహబూబాబాద్ ఠాణాలో జరిగింది. టౌన్ సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జమాండ్లపల్లికి చెందిన పిట్టల నవీన్‌ను ఓ కేసు విషయంలో స్టేషన్‌కు తీసుకురాగా తన సెల్‌ఫోన్‌తో వీడియో తీస్తుండగా ఎస్సై వెంకట్రాములు వద్దని చెప్పారు. అయినా నవీన్